నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 19 నవంబర్ 2024 | HYDERABAD



## శభాష్ సతీశ్..

రోడ్డుపై దొరికిన రూ. 2 లక్షలను పోలీసులకు అందజేసి నిజాయతీ చాటుకున్నాడో వ్యక్తి. లాలాగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాలాపేటకు చెందిన సతీశ్‌కు సోమవారం ఉదయం స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా, రోడ్డుపై 2 లక్షలు కనిపించాయి. వెంటనే స్థానికుల సహాయంతో లాలాగూడ పోలీసులను సంప్రదించి నగదును అప్పగించాడు. నిజాయతీ చాటుకున్న సతీశ్‌ను పోలీసులు అభినందించారు.

-సికింద్రాబాద్, నవంబర్ 18






# ₹22 కోట్లు వృథాయేనా?

## జీఐఎస్ సర్వేపై నీలినీడలు

**ఇతర మున్సిపాలిటీల్లో కేంద్ర రంగ సంస్థతో సర్వే**
**జీహెచ్‌ఎంసీలో మాత్రం నియో జియో సంస్థకు అప్పగింత**
**సర్వే తీరుపై బల్దియా అసంతృప్తి**
**సదరు ఏజెన్సీకి నోటీసులు జారీ**

సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) సర్వే అటకెక్కిందా? డ్రోన్ సర్వే అంటూ తొలుత హడావుడి చేసిన యంత్రాంగం. .క్షేత్రస్థాయి సర్వే వచ్చే సరికి సదరు ఏజెన్సీ పనులు చేపట్టలేక చేతులెత్తేసిందా? జీఐఎస్ సర్వే పేరుతో రూ. 22 కోట్ల మేర ప్రజాధనం వృథా అయినట్టేనా? అంటే జీహెచ్‌ఎంసీ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తున్నది. ఇందుకు సదరు నియో జియో ఏజెన్సీ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన బల్దియా..నోటీసులు జారీ చేయడమే ఇందుకు కారణమని చెబుతూ వస్తున్నారు. ఈ సర్వేపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, బాధ్యతాయుతంగా వ్యవహరించకపోవడంతో ఈ ప్రక్రియ కేవలం ప్రకటనలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జూలై 30న ప్రారంభించిన సర్వే ..ఇప్పటి వరకు ఎన్ని ప్రాంతాల్లో సర్వే చేశారు? ఎన్ని ఆస్తులను గుర్తించారు? డ్రోన్ సర్వేలు ఎక్కడెక్కడ చేశారు? ఇంటింటి సర్వేలు ఏ ప్రాంతాల్లో ఇప్పటి వరకు పూర్తి చేశారు..? ప్రభుత్వ ఆస్తులు ఎన్ని ఉన్నాయి? అనేది గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్నింటికంటే మించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లోని ఆస్తులను పన్నుల పరిధిలోకి తీసుకొచ్చేందుకు చేపట్టాల్సిన ఇంటిగ్రేటెడ్ సర్వే బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్ఈ)కి పురపాలక అప్పజెప్పింది. జీహెచ్‌ఎంసీలో మాత్రం ప్రైవేట్ సంస్థ నియో జియో సంస్థకు అప్పగించింది. ఈ ఏజెన్సీకి రూ. 22 కోట్ల మేర జీహెచ్‌ఎంసీ చెల్లించాల్సి ఉంది. సదరు ఏజెన్సీ పనితీరు ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో ప్రజాధనం వృథా అవుతుందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ జీఐఎస్ సర్వేపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లలో 145 మంది ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, 340 మంది బిల్ కలెక్టర్లతో సర్వే చేయిస్తే మంచి ఫలితాలు వచ్చేదని పలువురు పలువురు డిప్యూటీ కమిషనర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### 18 నెలల గడువు తీసుకొని..

జీహెచ్‌ఎంసీ పరిధిలో సర్వే ప్రక్రియ ఈ ఏడాది జూలై 30న ప్రారంభించారు. ఈ జీఐఎస్ సర్వేకు జీహెచ్‌ఎంసీ దాదాపు రూ. 22 కోట్ల మేర ఖర్చు చేస్తున్నది. గ్రేటర్ పరిధిలో ప్రతి ఆస్తిని, నిర్మాణాన్ని, ఖాళీ ప్లాట్లను, నివాసాలను, వ్యాపార భవనాలను గుర్తించి మ్యాపింగ్ చేసేందుకు గరిష్ఠంగా 18 నెలల గడువు తీసుకుని 20 లక్షల ఆస్తులను గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే గడిచిన మూడు నెలల్లో 15వేల ఆస్తులను మాత్రమే లెక్కించినట్టు అధికారులు చెబుతున్నారు. మూడు నెలల్లో కనీసం 15వేల ఆస్తుల గుర్తింపునకే పరిమితమైతే సదరు ఏజెన్సీతో వచ్చే 15 నెలల్లో 20 లక్షల ఆస్తుల గుర్తింపు సాధ్యమేనా.. అన్న ప్రశ్న తలెత్తుతున్నది.

### సమగ్ర వివరాలు ఇస్తే..

అర్బన్ ప్లానింగ్, రిసోర్స్ మేనేజ్‌మెంట్‌ను మెరుగుపరిచేందుకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని ఆస్తులు, యూటీలిటీస్ మ్యాప్ చేయడానికి ఇంటిగ్రేటెడ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం సర్వేను నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఫిజికల్ సర్వేకు ప్రజలు సహకరించే పరిస్థితులు లేవన్న చర్చ బహిరంగంగానే జరుగుతున్నది. అధికారుల ప్రకటనలకు క్షేత్రస్థాయి పర్యటనలో ప్రజల నుంచి సేకరిస్తున్న వివరాలతో ఇప్పటికే ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. సర్వేకు వచ్చిన అధికారులు, సిబ్బంది జీహెచ్‌ఎంసీకి సంబంధించిన వారేనా? లేదంటే ప్రైవేట్ వ్యక్తులా? అన్న కోణంలో కొందరు? సమగ్ర వివరాలు ఇస్తే ఆస్తిపన్ను భారం మరింత పడుతుందని మరికొందరు? జీహెచ్‌ఎంసీ వద్ద వివరాలు ఉన్నప్పటికీ మళ్లీ ఎందుకు అడుగుతున్నారని మరికొందరు సర్వేకు దూరంగా ఉంటున్నారు.

# కాలుష్య కోరల్లో భాగ్యనగరం

**ఏక్యూఐ 170గా నమోదు**
**అగ్రస్థానంలో దేశ రాజధాని ఢిల్లీ**
**ఏడో స్థానంలో హైదరాబాద్**
**మన కంటే మెరుగ్గా ఉన్న బెంగళూరు, చెన్నై**


సిటీబ్యూరో, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): పెరుగుతున్న వాహనాల రద్దీ, మానవ తప్పిదాలు, కాలుష్య కారకాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్‌లో గాలి నాణ్యత పడిపోతున్నది. ఏటా పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా వాహనాలపై నియంత్రణ లేకపోవడంతో.. ఏడాది కాలంలోనే కలుషిత నగరాల జాబితాలో చేరింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఆధారంగా రూపొందించిన నివేదిక ప్రకారం దేశంలోనే అత్యంత కలుషిత నగరాల జాబితాలో హైదరాబాద్ ఏడో స్థానంలో ఉన్నదని వెల్లడైంది. మొదటి స్థానంలో ఢిల్లీ ఉండగా... నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉండే బెంగళూరు, చెన్నై నగరాలు హైదరాబాద్ కంటే మెరుగ్గా ఉన్నాయి.

**కలుషిత నగరాలు**

| నగరం | ఏక్యూఐ |
|---|---|
| ఢిల్లీ | 567 |
| పాట్నా | 238 |
| కోల్‌కతా | 231 |
| లక్నో | 224 |
| జైపూర్ | 182 |
| భోపాల్ | 172 |
| హైదరాబాద్ | 170 |
| ముంబై | 154 |
| రాయ్‌పూర్ | 152 |
| అహ్మదాబాద్ | 110 |
| బెంగళూరు | 82 |
| చెన్నై | 82 |

### పర్యావరణ పరిరక్షణ

హైదరాబాద్ కేంద్రంగా పర్యావరణ పరిరక్షణ పడకేసింది. కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షణ లోపంతో నగరంలో గాలి నాణ్యత వేగంగా పడిపోతున్నది. దీనికి తోడు విపరీతంగా పెరిగిన వాహనాల రద్దీతో గాలిలో దుమ్ము, ధూళి కణాల ప్రభావం భారీగా ఉందని తేలింది. దీంతో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సూచిక దారుణంగా పడిపోతున్నది. దేశంలోనే అత్యంత కలుషిత నగరాల జాబితాలో హైదరాబాద్ చేరింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లో ఏడో స్థానంలో ఉంది. నగరంలో పీల్చే గాలి తీవ్రమైన అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోవడంలో వాహనాల రద్దీ, కర్బన ఉద్గారాల తీవ్రత, పరిశ్రమల వ్యర్థాలే ప్రధానం. అయితే వీటిని నియంత్రించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి వైఫల్యంతో నగరం కాలుష్య కాసారంగా మారుతున్నది.



### కలుషిత నగరాలలో హైదరాబాద్

దేశంలోని ప్రధానమైన కలుషిత నగరాల జాబితాను ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) ఆధారంగా రూపొందించారు. ఇందులో దేశ రాజధాని ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 567తో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో పాట్నా, కోల్‌కతా, లక్నో, జైపూర్, భోపాల్ ఉన్నాయి. హైదరాబాద్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 170గా నమోదైంది. ఇక నిత్యం ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉండే ముంబై, బెంగళూరు నగరాల్లోనూ హైదరాబాద్ కంటే మెరుగైన వాతావరణమే ఉండటం విశేషం. పొల్యూటేడ్ నగరాల జాబితాల్లో ఈ రెండు నగరాలు కూడా 11, 12 స్థానాల్లో ఉన్నాయి.



చందానగర్ దీప్తిశ్రీనగర్‌లోని రేగులకుంట చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# ఆక్రమణలు తొలగిస్తాం..

**హైడ్రా కమిషనర్ రంగనాథ్**

సిటీబ్యూరో/కొండాపూర్: చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ఆక్రమణల తొలగింపునకు హైడ్రా చర్యలు తీసుకుంటుందని కమిషనర్ రంగనాథ్ అన్నారు. సోమవారం ఆయన చందానగర్‌లో ఉన్న భక్షికుంట, రేగుల కుంటను లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలిచే ఆనంద్ మలిగావద్‌తో కలిసి కమిషనర్ సందర్శించి.... చెరువుల అభివృద్ధిపై చేపట్టిన విధానాలపై హర్షం వ్యక్తం చేశారు.

### ఆ చెరువులే ఆదర్శంగా..

చందానగర్‌లో ఉన్న భక్షికుంట, రేగుల కుంటను పరిశీలించిన హైడ్రా కమిషనర్.. చెరువుల అభివృద్ధిపై చేపట్టిన విధానాలపై హర్షం వ్యక్తం చేశారు. తక్కువ నిధులతో ఈ రెండు చెరువులను అభివృద్ధి చేయడంపై అభినందించారు. నగరంలో మరో 10 చెరువులను కూడా ఈ రెండు చెరువుల తరహాలోనే అభివృద్ధి చేస్తామని, దీనికి వీటినే ప్రామాణికంగా తీసుకుంటామని చెప్పి..బీఆర్ఎస్ సర్కారు పనితీరుకు గుర్తింపునిచ్చారు. అయితే హైడ్రా కమిషనర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారితే... కాంగ్రెస్‌కు ఇదొక చెంపపెట్టులాంటిదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నగరంలో చెరువులను ఆధునీకరించాలనే సంకల్పంతో మూడేండ్ల కిందటే ఈ రెండు చెరువులకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటీ కార్యక్రమంలో ఐటీ కంపెనీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పగించింది. అయితే వీటి ఆధునీకరణ పనులను మలిగావద్ ఫౌండేషన్ పర్యవేక్షించగా, వాకింగ్ ట్రాక్, మురుగు నీరు చేరకుండా ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనులు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఆధునీకరణ చేసిన చెరువులను ప్రారంభించారు. కాగా, నగరంలోని చెరువుల పునర్జీవం, సంరక్షణ కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై పొల్యుష్యన్ కంట్రోల్ బోర్డు అధికారులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ చర్చించారు. పీసీబీ మెంబర్ సెక్రటరీ జి. రవి, అధికారులతో నగరంలో చెరువుల్లోకి చేరుతున్న పారిశ్రామిక వ్యర్థాలు, సీవరేజీ వాటర్ నిర్వహణ, ఆధునీకరించేందుకు చేపట్టాల్సిన ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు.

# ప్రజావాణిలో ఇండ్ల దరఖాస్తులే అధికం

సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 183 దరఖాస్తులు రాగా, అందులో 130 దరఖాస్తులు గృహ నిర్మాణ శాఖకు సంబంధించనవేనని అదనపు కలెక్టర్ కదిరవన్ తెలిపారు. పింఛన్లు 14, భూ సమస్యలు 9, విద్యాశాఖ 3 ఇలా దరఖాస్తులు వచ్చినట్టు చెప్పారు.



నగరంలో రోజురోజుకు పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారుతున్నది. గగన్‌మహల్ రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలను చిత్రంలో చూడొచ్చు.

# కంటైనర్ వేసి.. కడీలు పాతి

## దర్జాగా సర్కారు భూమి కబ్జా

**డీ పోచంపల్లి 120లో యధేచ్ఛగా భూ ఆక్రమణలు..**
**పట్టించుకోని రెవెన్యూ అధికారులు**

దుండిగల్, నవంబర్18: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మ- దుండిగల్ మండలంలో ప్రభుత్వ భూములు హారతికర్పూరంలా కరిగిపోతున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గతంలో ఎప్పుడో ఇచ్చిన పట్టాల పేరుతో దందాను కొనసాగిస్తుండగా, అవగాహన లోపంతో రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కిందిస్థాయి సిబ్బంది ఒకరు నిర్మాణదారులతో కుమ్మక్కై నిర్మాణానికి ఓ రేటును నిర్ణయించి.. వసూలు చేయడంతో పాటు అధికారులకు అందులో వాటా అందిస్తున్నట్లు తెలుస్తున్నది. తాజాగా మండల పరిధిలోని డీ పోచంపల్లి సర్వేనంబర్ 120/6లో ఓ వ్యక్తి 120/1 పేరిట ఉన్న ఇంటిపట్టాను అడ్డుపెట్టుకుని సుమారు రూ .50లక్షల విలువైన 250 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. రెండు, మూడు రోజులుగా సదరు స్థలంలో ఓ కంటైనర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు చుట్టూ కడీలు వేయడం గమనార్హం. రెవెన్యూ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఈ తతంగం నడుస్తున్నా మండల తహసీల్ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### స్పందించని తహసీల్దార్..

ఇదే విషయమై వివరణ కోరేందకు గండిమైసమ్మ-దుండిగల్ మండలం తహసీల్దార్ మతీన్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా, ఆయన ఎంతకూ స్పందించకపోవడం గమనార్హం. కాగా, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు తమపై చర్యలు తీసుకునే దమ్ము ఎవరికి ఉంది.. అనే ధీమాతో ఉన్నట్లు సమాచారం. ఇక్కడ జరుగుతున్న భూ ఆక్రమణలపై ఆర్డీవో స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

### అధికారుల అవగాహన లోపంతో..

రెండు నెలల కిందట ఇక్కడ పనిచేస్తున్న గిర్ధావర్(ఆర్ఐ)లు ఇద్దరు ఒకే సారి ఇక్కడి నుంచి బదిలీకావడంతో కొత్తగా విధుల్లో చేరిన ఉద్యోగులకు ఇక్కడి ప్రభుత్వ భూములపై ఎంత మాత్రం అవగాహన లేదని తెలుస్తున్నది. ఇదే అదునుగా భావించిన ఓ గ్రామస్థాయి ఉద్యోగి చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది దసరా పండుగ నుంచి వారాంతపు సెలవు దినాల్లో సర్వే నంబర్ 120లో రాత్రికి రాత్రే గదులు నిర్మించి, తెల్లారే సరికి సున్నం వేసి కిరాయి మనుషులను దింపుతున్నట్లు సర్వత్రా ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణదారులకు అండగా ఉంటున్న సదరు గ్రామస్థాయి ఉద్యోగి వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసి జేబులు నింపుకొంటున్నట్లు సమాచారం. ఎవరైనా వీటిపై గిర్ధావర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే సదరు నిర్మాణాలకు పట్టాలు ఉన్నాయని మభ్యపెడుతున్నట్లు సమాచారం. ఫిర్యాదుదారులను, కొందరు అధికారులను మేనేజ్ చేస్తూ తన చెప్పుచేతల్లో ఉంచుకున్నట్లు తహసీల్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో జనం ఆరోపణలు గుప్పిస్తున్నట్లు సమాచారం. గడిచిన రెండు నెలల కాలంలో పదులసంఖ్యలో ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు జరిగినా.. అధికారులు అడ్డుకట్ట వేయకపోవడమే అందుకు నిదర్శనంగా నిలుస్తుందంటున్నారు స్థానికులు. అయితే సదరు గ్రామస్థాయి ఉద్యోగిని అవినీతి ఆరోపణలతో ఓ సారి విధుల్లో నుంచి తొలగించానంటున్న తహసీల్దార్ మరోసారి మాట మారుస్తూ సరిపడా సిబ్బంది లేని కారణంగా తామే అతడి సేవలు వినియోగించుకుంటున్నామని చెప్పడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




సర్కారు భూమిలో వెలసిన కంటైనర్... కడీలు

# హెచ్‌ఎండీఏ ప్లానింగ్‌లో లుకలుకలు

**డిప్యూటేషన్ వర్సెస్ శాశ్వత సిబ్బంది**
**ఇరు ఉద్యోగుల మధ్య వైరుధ్యాలు**

సిటీబ్యూరో : హెచ్‌ఎండీఏలో శాశ్వత, డిప్యూటేషన్ అధికారుల మధ్య ఉన్న లుకలుకలు బయటపడుతున్నాయి. ఇప్పటికే డిప్యూటేషన్ అధికారులతో హెచ్‌ఎండీఏను నింపేస్తున్నారని శాశ్వత సిబ్బంది అసహనంతో ఉండగా, తాజాగా జరుగుతున్న కొన్ని సంఘటనలతో ఇరు ఉద్యోగుల మధ్య ఉన్న వైరుధ్యాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో కొందరు డిప్యూటేషన్ ఉన్నతాధికారులు సిబ్బందిని నియంత్రించే ధోరణితో వ్యవహరిస్తున్నారని సమాచారం. కొన్ని వివాదాస్పదమైన అంశాలు వెలుగులోకి వస్తున్నాయనే అనుమానంతో కీలక బాధ్యతలకు దూరంగా ఉంచుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

### అత్యంత కీలకమైన ప్లానింగ్‌లో..

రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తీసుకువచ్చే విభాగాల్లో అత్యంత కీలకమైనది హెచ్‌ఎండీఏలోని ప్లానింగ్ శాఖ. హెచ్‌ఎండీఏ ప్లానింగ్ అనుమతిస్తేనే అల్ట్రా మోడ్రన్ విల్లా నుంచి హైరైజ్ ప్రాజెక్టు వరకు నిర్మాణం సాధ్యం అవుతుంది. అందుకే ఈ విభాగంలో పనిచేసేందుకు ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి డిప్యూటేషన్‌పై వస్తుంటారు. ఈ క్రమంలోనే శాశ్వత ఉద్యోగులతో నిండుగా ఉండాల్సిన ఈ విభాగం గడిచిన కొంత కాలంగా డిప్యూటేషన్ అధికారులతో నిండిపోయింది. ఇదే హెచ్‌ఎండీఏ మాతృక కలిగిన ఉద్యోగుల అవకాశాలు, ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నాయని వాపోతున్నారు. దీంతో డిప్యూటేషన్ వర్సెస్ శాశ్వత అధికారుల అన్నట్లు వ్యవహారాలు సాగుతున్నాయి.

### ఎందుకీ వేధింపులు..

డిప్యూటేషన్ వర్సెస్ శాశ్వత ఉద్యోగుల మధ్య పెరుగుతున్న వివాదాలతో కొందరు అధికారులను వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. విధుల కేటాయింపుల్లో ప్రాధాన్యతనివ్వకుండా... అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిని చేతుల్లో పెట్టుకొని శాశ్వత సిబ్బందికి దూరంగా ఉంచుతున్నట్లు తెలిసింది. కనీసం పై అధికారి అనే భక్తి కూడా ఉండాల్సిన అవసరమే లేదన్నట్లుగా డిప్యూటేషన్ అధికారులు సిబ్బందిని ఊసిగొల్పుతున్నట్లుగా తెలిసింది. దీంతో కొందరు ఉద్యోగులు మానసిక వేదనకు గురవుతున్నారు. డిపార్టుమెంట్‌లో జరుగుతున్న ఈ వ్యవహారం తమకు వేధింపుల కంటే దారుణంగా ఉన్నదని కొందరు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.